
# T.V. వ్రతకల్పం

ఎమ్మెస్సార్ మూర్తి




ఏవంగుణ విశేషణ విశిష్టాయాం, శుభ తిథౌ అస్మాకం సహకుటుంబానాం క్షేమస్థైర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభి వృద్ధ్యర్థం ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ పురుషార్థ ప్రీత్తత్వ ఫల సిద్ధ్యర్థం, సత్సంతాన సౌభాగ్య శుభ ఫలావాప్త్యర్థం, వర్షే వర్షే ప్రయుక్తా శ్రీ త్రిలోకాంజన వారుణీ ముద్దిశ్య అంజన వారుణీ ప్రీత్యర్థం భవిష్యోత్తరోత్తర పురాణ కల్పోక్త ప్రకారణేన యావచ్ఛక్తి ధ్యాన ఆవాహనాది షోడశోపచార పూజాం కరిష్యే.

తదారంభేన కలశ పూజాం కరిష్యే.

కలశ పూజానంతరం గణాధిపతిం పూజయామి. తదనంతరం త్రిలోకాంజన వారుణీ పూజా మారంభయేత్

**అథ ధ్యానం :-**

త్రిలోకాంజన వారుణీదేవీ టీవీ నామ ప్రకీర్తితా దురితక్షయ నివారణార్థం సురాసుర నమస్కృతే.

**అథంగ పూజా :-**

చంచలాయై నమః స్టాండుం పూజయామి

చపలాయై నమః స్టెబిలైజర్ పూజయామి

శత ఛానల యుక్తాయై నమః రిమోటుం పూజయామి.

శుక్ర శిష్య సంయుక్తాయనమః డిష్యాది ఏంటినా పూజయామి

విపరీత సుఖదాయైనమః వి.సి. ప్లే ఏవం రికార్డాది సర్వాంగే పూజయామి.

**అథ గ్రంధి పూజా :-**

కామ గాన కథాయై నమః ప్రథమ గ్రంథిం పూజయామి

క్రోధ గాథాయైనమః ద్వితీయ గ్రంథిం పూజయామి

ప్రకటనకర్తా లోభ ప్రకాశిన్యై నమః తృతీయ గ్రంథిం పూజయామి.

శిశు మోహన కారిణ్యై నమః చతుర్థ గ్రంథిం పూజయామి

కుమార మద వివృద్ధాయై నమః పంచమ గ్రంథిం పూజయామి

సర్వజన మత్సరాంకుర మూర్త్యై నమః షష్ఠ గ్రంథిం పూజయామి.

**అథ అష్టోత్తర శతనామ పూజా :**

(ప్రతి నామమునకు ముందు 'ఓం' అని చేర్చవలెను.)

టీవీయై నమః

ఇడియట్ డబ్బాయై నమః

ప్రాయోజిత కార్యక్రమ పోషణాయైనమః

జెమిన్యాది నానా ఛానలై నమః

కళా ప్రియాయై నమః


సత్కళాకార ఖేదాయై నమః
సకల క్రీడా ప్రేరణాయై నమః
లేట్ నైటాయ నమః
సినీ పరిశ్రమ కుఠారాయై నమః
గ్లామరాయై నమః
గ్లామర్ ప్రదాన్యై నమః
వి.సీ. పతివ్రతాయై నమః
సినీ సముద్ర పుత్రికాయై నమః
వేదాంత ప్రచారిణ్యై నమః
కార్యక్రమ విలంబేన ఖేదాయై నమః
రిమోటాలంకృతాయై నమః
డీ సెన్సిటైజయ నమః
అనామక కవీంద్ర వరదాయై నమః
ధనమనోధన నిర్మాత ప్రియాయై నమః
దేశభక్త గాన ప్రియాయై నమః
దేశనాయక వియోగ శోకాయై నమః
వివిధ భాషా భారత్యై నమః

ప్రజా బాహుళ్య ప్రియాయై నమః
రాత్రి ప్రియాయై నమః
క్రైమ్ సెక్సాది విన్యాస సంరంభాయై నమః
సకల దిశావ్రతై నమః
వివిధ గ్రహ పోషితాయై నమః
ఆకాశవాణి ప్రియ సోదర్యై నమః
అలౌకిక ప్రకటనాలంకృతాయై నమః
త్రికాల సంపన్నాయై నమః
కాలహరణ కారిణ్యై నమః
విశ్వ జనన్యై నమః
లోచన ప్రియాయై నమః
సులోచన ప్రదాయై నమః
కర్ణ ప్రియాయై నమః
కర్ణ కఠోరాయై నమః
వార్తాయై నమః
దీప్తాయై నమః
దృశ్యే నమః
వాచే నమః

ఆహ్లాద జనయిన్యై నమః
శిరోవేధాయ నమః
కథాయై నమః
శ్రద్ధాయై నమః
అశ్రద్ధా వివృద్ధై నమః
విద్యాయై నమః
అవిద్యా ప్రసాద్యై నమః
ప్రకృత్యై నమః
వికృత్యై నమః
ప్రజానాయక ఆకర్షణాయై నమః
ప్రజానాయక భీకరాయై నమః
సినీనట దివ్యాంకాయై నమః
వ్యాపార రూపాయై నమః
సర్వాంతర నిరంతరాయై నమః


## స్తోత్రమ్

టీ.వీం సినీ సముద్ర రాజ తనయాం శ్రీమండి ధామేశ్వరీ




సర్వార్థ సమృద్ధ భానలయుతాం ప్రకటనా అలంకృతావ్

నానాగోల విధాన ధారసహితాం డిష్యాది సంసేవితాం




త్వాం త్రైలోక్య కుటుంబినీం బుల్లి పటలాం ఆబాల గోపాల ప్రియాం!

అథ కథా ప్రారంభం :

**సూ**తపౌరాణికుండు శౌనకాది మహర్షులం జూచి ఇట్లనియె- 'మునివర్యులారా! ప్రజలకు సర్వ సౌభాగ్యంబులు గలుగునట్టి ఒక వ్రతరాజంబు పూర్వము పరమేశ్వరుండు పార్వతీ దేవికిం జెప్పె' దానిం జెప్పెద వినుండు.

కైలాస పర్వతంబునందు పరమేశ్వరుండు సుప్రసన్నుండై కూర్చొని యుండ శబ్దార్థ ప్రతీక యగు పార్వతీదేవి పరమేశ్వరుని వామాంకము నందు జేరి ముద్దుగా నిట్లనియె! "స్వామీ! స్త్రీ పురుషులు వారి సత్సంతానము ఏ వ్రతమొనర్చిన సర్వ సౌభాగ్యంబు నొందుదురో అట్టి వ్రతంబు నా కానతీయ వలయును." అనిన అప్పరమేశ్వరుం డిట్లనియె. "ఓ మనోహరీ! స్త్రీలకు పుత్ర పౌత్రాది సంపత్తులునూ, సర్వాభరణ భాగ్యమున్నూ కలుగ జేసెడి వి.ఎల్. వ్రతంబు నీకు విదితమే!"

"స్వామీ వి.ఎల్ వ్రతంబనగా..."

"నిరంతర ఉద్యోగానురక్తులయిన సాధ్వీమణులు టైమ్ లేక వరలక్ష్మీ వ్రతంబునే వి.ఎల్ వ్రతంబుగా యథాశక్తి చేసికొనుచున్నారు. ఇట్టి పదభ్రష్ట ప్రయోగములకు తదితర కలికాల హరణ బాధోపశమనములకు త్రిలోకాంజన వారుణీ వ్రతకల్పము మిక్కిలి శ్రేష్టము."

అపుడు పార్వతీదేవి "ఈజిట్ సో? నాకెంతో కుతూహలంగా ఉంది. అసలీ త్రిలోకాలేమిటి? అంజనమేమిటి? వారుణి అనగా నేమి? వర్డ్ బై వర్డ్ మీనింగ్ చెప్పరేంటి?" అని గోముగా అడిగింది.

"మై డియర్ పార్వతీ! ప్రపంచంలో నలుమూలలా ఏమి జరుగుతుందో అంజనంలాగా ఇంట్లోనే కనిపించే యంత్ర రాజ మొకటి కలదు. దానిని (త్రిలోకాంజన) త్రైలోక్యాంజన వారుణీ యంత్రము లేదా టివి అంటారు. ఉపరి వారుణి శబ్దార్థమేమన శత తోక. నక్షత్ర శతంలాగా ఎన్నో మండలాల నుండి కరతలామలకం లాంటి రిమోట్ కంట్రోల్‌లో వస్తుంటాయి. అవి మత్తు కల్గిస్తుంటాయి."

అపుడు పార్వతి అచ్చెరువంది, "ఆహా! ఎంత విచిత్రము. అది సరేగానీ, ఈ వ్రత మాచరిస్తే ఏమవుతుంది? దానాలూ గట్రా లేవు గదా? పూర్వం ఎవరు ఎందుకు ఎలా ఈ వ్రతం చేసి సుఖించార"ని పార్వతి కుతూహలంగా అడిగింది.

అపుడు పరమేశ్వరుడు "సారీ పార్వతీ! యంత్ర నామ శ్రవణం చేత ఎక్సైట్ అయిపోయి ఏమేమి దానాలు ఇవ్వాలి అనే బదులు దానాలేమీ లేవు గదా అనే లోభంలో పడ్డావు. సాంగోపాంగంగా చెప్పింది విను" అన్నాడు.

"అయామ్ సారీ - అదేదయినా పొరపాటయితే చూసుకోడానికి మీరున్నారు గదా - చెప్పండి" అంది పార్వతి.

"పూర్వం నా భక్తుడయిన గుణాఢ్యుడు ఇలాటి మన ముచ్చట్లు వింటూ పైశాచీ భాషలో బృహత్కథ రచించాడు. ఆ కథలూ, కథలలోని పాత్రలూ అతని ధారణా బలం చేత సజీవమై పోయాయి. తమ కథా కథనం ఎవరూ పట్టించుకునే అవకాశం లేక ఆ పాత్రలు వేదనతో దశదిశలను ప్రార్థించగా అవి కరుణించి సినిమాను సృష్టించాయి. ఆ బిందువులే సింధువై సర్వజనులు ఆనంద భరితులై ఉండ తత్పరిశ్రమలోని కామక్రోధాది పర్యావరణ కాలుష్యమునకు కవీ, కళాప్రియుడయిన శుక్రుడు ఖేదమొంది సినీ సముద్రమును చిన్నచూపు చూడగా త్రైలోక్యాంజన వారుణి సముద్భవించె!"

"ఇట్లు శుక్రశిష్య ప్రేరితమైన వారుణి యందు విపరీత కథా గాన ప్రబంధములు చెలరేగి, సత్కథా కాలక్షేపము అను చిరు దీపమును గాఢాంధ కారముగా నావరించె. ఆ సమయమున మధ్య తరగతి కుటుంబీకులైనను, నిరంతర టీవీ దృశ్య మానసగ్రస్తులై తమ తమ దైనందిన కార్య క్రమములు మందగించిన కొండొక దంపతు లుండిరి. ఇంతియే కాక తత్ టీవీ ప్రోగ్రాములందు పెట్టుబడి దారుల వ్యాపార ప్రకటనలు మెండు. ఒకానొక ప్రకటనయందు అందమైన భార్య నటునిగా నున్న తన భర్తకు అత్యంత సౌజన్యము, విలాసముతో తలనొప్పి మందు రాయుట ఆ గృహస్థు చూచి అదే విధముగా తన నిజ భార్య సేవ చేయుట లేదని ఆమెపై అలిగెను. అందుల కా గృహిణి "ఆర్యా! ఆ తలనొప్పి మందుతో మీకేమి పని? నాకు గదా కావలసినది! ఈ ప్రకటనలు విరజిమ్ము వస్తు సముదాయము మన గృహమునందు లేదని నాకు తలనొప్పి, మీదు మిక్కిలి జ్వరము వచ్చుచున్నది." ఇట్లు కథగాన ప్రబంధములు వదలి వేసి ఆ గృహస్థు, గృహిణి ప్రకటనలకు ప్రభావితులైరి. వారి పిల్లలు కూడా టీవీ అంతర్వమిత ప్రకటన యందలి ఖాద్యపానీయ క్రీడా వినోద వివిధానంద వస్తు సముదాయమును చూచి ఉవ్విళ్లూరుచు దిక్కుతోచక చింతా క్రాంతులైరి. ఇట్టి గంభీర వదనలైన దంపతులు బంధు మిత్రుల పరామర్శించ, వారును అట్లే ఖిన్నులై ఉండిరి.

తదుపరి యా గృహిణి కుటుంబ క్షేమ నిమిత్తమై స్వస్వరూపమైన నన్ను ఇచ్ఛా క్రియాజ్ఞాన శక్తియైన నిన్ను ఆర్తితో స్మరించ ఆ సౌజన్యవతికి స్వప్నమున నే నీ వ్రత మాదేశించితిని.

"అపుడు ఆ సాధ్వి ఈ వ్రతమును చిత్త శుద్ధితో నొనర్చి టీవీని యుక్తాయుక్తముగా కట్టివేసి, వార్తాది కార్యక్రమములను యథాశక్తి వీక్షించి దైనందినాభివృద్ధి, పుత్రీపుత్రుల విద్యాభివృద్ధి నిరంతరాభివృద్ధి కాగా సుఖంబుండిరి. కావున ఈ కథను వినువారు, చదువువారు టి.వి. సంకల్ప పీడనా విరక్తులై, సత్సంకల్పానురక్తులై అలౌకిక ఐశ్వర్యముల నొంది సుఖించెదరు." అని చెప్పగా విని పరమేశ్వర నిరంతర కథాకథన కుతూహల యయిన పార్వతి మందస్మితయై 'ధన్యోస్మి'యని వెండిసుస్మిత యయ్యె. పరమేశ్వరుండును అద్దేవి భావంబు గ్రహించి సంతుష్టాంతరంగ సువర్ణ తరంగముల (నద్దేవి) నోలలాడించె.

టి.వి. వ్రతకల్పము సంపూర్ణము.